# తీర్పు



"ఈ తగువు ఇంక నే తీర్చలేను—"

— అంటూ ఒక వీశ బరువుగల పదార్థమేదో విసిరిపోయింది సుందర రామయ్య భార్య. అది తిన్నగా వచ్చి సుందరరామయ్య ఒడిలో పడ్డది.

ఒడిలోపడ్డ బరువుకేసి క్యూరియస్‌గా చూసిన సుందరరామయ్యకు అందమైన అట్టలు అయిదు కనిపించేయి.

అవి అయిదూ పిల్లలు పరీక్షల్లో వాడుకునే రైటింగ్‌పేడ్స్ అందులో నాలుగు ఒక్కపోలికను పుట్టిన అన్నదమ్ముల్లా ఉన్నాయి. ఒక్కటి మాత్రం విలక్షణమైనది దాని సైజు తక్కినవాటి కన్నా కాస్త పెద్దది దానిమీద వేసిన కాగితం అందమైనదే కాక ఖరీదైనది కూడాను. దానికి అధికంగా కాలికోతో చేసిన కార్నర్ పోకెట్లున్నాయి.

సుందరరామయ్యకు నలుగురు మగ

# శ్రీకాళీపట్నపు రామారావు



పిల్లలున్నారు. కడగొట్టుది ఆడపిల్ల. పెద్దవాళ్ళు ముగ్గురూ హైస్కూలుకు పోతున్నారు.

తలెత్తి చూసిన సుందర రామయ్యకు ద్వారం దగ్గర పిల్లల్లో ఉన్న వాళ్ళిద్దరూ కనిపించేరు. ప్రశాంతంగా వున్న తండ్రి మొహం చూసేక వాళ్ళిద్దరూ లోనికి ప్రవేశించేరు. తండ్రి ప్రశ్నించగా కూతురు ప్రారంభించింది—కొడుకు పూర్తి చేశాడు

రెండో అన్నయ్యకు బళ్ళో అట్టలు చెయ్యడం నేర్పారు. అలాంటివి బళ్ళో చాలా చేసి అమ్మారు. ఒక్కొక్కటి ముప్ఫై నయా పైసల కమ్మారు. పెదన్నయ్య అర్ధరూపాయి ఖర్చుతో అరడజను చెయ్యవచ్చునని కనిపెట్టేడు. బజారులో ఆ అట్టలే ఒక్కొక్కటి అరణాలని చెపితే అమ్మ అర్ధరూపాయి యిచ్చింది. ఉన్నవాళ్ళు ఐదుగురే కాబట్టి

అయిదు అట్టలే చేసుకుందా మన్నారు. మిగిలిన డబ్బు—ఒక అట్టమీద అధికంగా పెడితే అది అందమైన కాలికో అట్ట అయింది

తాను పెద్దవాడు కాబట్టి తనది పెద్దక్లాసు కాబట్టి ఆ అట్ట తాను తీసుకుంటా నన్నాడు పెద్దన్నయ్య. అలా వల్లకాదు నేను తీసుకుంటా నన్నాడు రెండో అన్నయ్య. అమ్మ మొదట పెద్దన్నయ్యకే యిచ్చేయ మంది. రెండోఅన్నయ్య వాదిస్తే వాడికే ఇచ్చేయబోయింది. తగువు తెగకపోవడం వల్ల తండ్రిదగ్గరకు వచ్చింది.

సుందరరామయ్య తెలివికి అది ఒక పెద్ద సమస్యకాదు. అయినా అతడు కొంచెంసేపు వెనకాముందు ఆలోచించేడు.

పెద్ద కొడుక్కు— సుందరరామయ్య తండ్రిపేరు పెట్టేరు. అందుచేత వాడంటే అతడికి పక్షపాత మని పిల్లల మధ్య అభిప్రాయ మున్నది.

రెండో వాడికి తల్లితండ్రి పేరు పెట్టారు కాబట్టి వాడంటే తల్లికి ముద్దని— భర్తపోయి నిస్సంతయి ఇంటజేరిన ఆడబడుచు — సుందర రామయ్య అప్పగారంటుంది.

పిల్లలూ పెద్దలూ యిలా పక్షాలుగా విడగొట్టబడ్డం సుందర రామయ్య కిష్టమైన విషయంకాదు. తన పిల్లలు త్రేతా యుగం నాటి శ్రీరామచంద్ర సోదరులను తలపిస్తూ ఒక్కటిగా ఉండాలని అతడి అభిమతం

అందుచేతనే అతడు యిందులో తొందర పనికిరా దనుకున్నాడు. ఆలోచించి —

"అన్నయ్యల ఇద్దర్నీ తీసుకురా."

— అని కొడుకును పంపాడు.

వాడు వెళ్ళేక అమ్మను కూడా తీసుకురా అని కూతుర్ని పంపాడు

పెద్దవాడు తెల్లగా నాజూగ్గా సయిలుగా ఉంటాడు. కళ్ళల్లో కొంత తెలివికూడా కనబడుతుంది. వాడిని చూస్తే వాడు నీళ్ళుపోసి పెంచుతున్న గున్న మామిడి మొక్కలా ఉంటాడు.

చిన్నవాడు కాస్త బండగా ఉంటాడు తెలియని వాళ్ళకి అన్నకన్న వాడే పెద్దవాడనిపిస్తాడు. మూసి ఉంచే పెదవుల్లో పట్టుదలా, తెరచిఉంచే కన్నుల్లో నిబ్బరం కనిపిస్తాయి. చూచే వాళ్ళకు వాడితో కొంచెం జాగ్రత్తగా ఉండడం మంచిదనిపిస్తుంది.

సుందర రామయ్య చూపులకు పెద్ద కొడుకులో దెబ్బతిన్న అభిమానాన్ని దాచుకోడానికి పడే శ్రమ కనిపించింది. వాడి నిలకడలో స్థిరత్వం లేదు. వాడి నవ్వులో నిండుతనం లేదు. కాని ఎక్కడో ఎక్కడో వాడిలో భరోసా కొంత మిగిలి ఉన్నది.

రెండోవాడు పళ్లూ, కళ్లూ, దవడలూ, వెనక్కు ముడిచిన చేతులూ అన్నీ

బిగించుకొని దేవాలయ స్తంభాలమీద కొంచెం వెనక్కి జారబడి ఉండే బొమ్మలా స్థిరంగా నించొని ఉన్నాడు — గోడకానుకొని ఆ బొమ్మల మూపుమీద సాధారణంగా ఏదో బరువుంటుంది. వీడి వీపుమీద బరువేదీ ఉన్నట్టు కనుపించదు. ముఖం మాత్రం కందగడ్డలా ఉన్నది.

వాడు ప్రతిదానికీ ఇట్టే సీరియస్ అయిపోయే రకమని సుందర రామయ్య అంతకుముందే వాడిని గూర్చి ఒక అభిప్రాయం ఏర్పరుచు కున్నాడు. తక్కిన పిల్లలంతా తమాషా చూస్తున్నట్టూ, ఏం జరుగుతుందో నన్నట్టూ ఒకమూల చేరి ఉన్నారు. సుందర రామయ్య భార్య తలుపుదగ్గర నిల్చున్నది. ఆమె మూతి ముడుచుకుని ఉన్నది.

ఆతడు అప్పగారివంక చూడలేదు. చిన్నప్పుడు తమ పుట్టినింట వారాలు చేసుక చదువుకున్న అబ్బి తమ లా సూట్‌లో జడ్జి అయితే ఎలా చూస్తుందో అచ్చు అలానే చూస్తోంది ఆమె తమ్ముడి వంక.

సుందరరామయ్య కొంచెం సేపలా అందరివంకా చూసి చిరునవ్వు నవ్వుతూ రెండోకొడుకు ముఖంలోకి చూసీ చూడ నట్టు చూస్తూ అన్నాడు.

'సరే మీ అభిప్రాయా లన్నీ ముందు వరసగా చెప్పండి. ఆ తరవాత నే చెప్ప వలసింది చెప్తాను.

ఎవరూ మాట్లాడలేదు.

సుందరరామయ్య మొదట పెద్ద కొడుకును మాటాడమందా మను కున్నాడు. మళ్ళా మనసు మార్చుకుని ఆఖరు పిల్లతో ప్రారంభిందా మన్నాడు.

ఆర్డర్ జారీచేసేక విచారణ సజావుగా ప్రారంభ మయ్యిం దనిపించింది.

అందరికన్నా చిన్నది చిన్నది. అది కొంచెం సేపునశికింది తరువాతనవ్వింది. తరువాత సిగ్గుపడ్డది. ఆ తరువాత అక్కడ నుంచి పారిపోయింది.

ఆఖరు పిల్లవాడు అలా కాకుండా చెప్పేడు. అందరికన్నా తానుచిన్నవాడు. కాబట్టి తాను ముందుఎంచుకోవా లన్నాడు.

"నువ్వెలా ఉన్నవాడి వయ్యావ్! నీ కన్నా చిన్నది చెల్లి ఉన్నది. అలా అయితే ఆ అట్ట దానికి పోతుంది"

"చెల్లి ఒకిటో కలాసేగా! దాని కెందుకు?"

"నువ్వు మూడో కలాసేగా! నీకు మాత్ర మెందుకు?"

"నాకు వచ్చే ఏడాదికి పనికివస్తుంది."

సుందరరామయ్య తన నాల్గవకొడుకు కూడా తెలివైన వాడిలా కనిపించగా చూసి సంతోషించాడు.

మూడవవాడు అంతకన్న కూడా చక్కగా వాదించాడు.

అన్నయ్య లిద్దరూ పెద్దవాళ్ళు. వాళ్ళు తలుచుకుంటే ఇంకొకటి మంచిది చేసుకోగలరు. తమ్ముడూ, చెల్లీ చిన్న వాళ్ళు — వాళ్ళకు దాని ఉపయోగం అట్టే

వుండదు. కాబట్టి తనకది రావడం న్యాయమన్నాడు. కాక పెద్దవాళ్ళిద్దరిలో ఒకరికి వెళ్ళాలంటే అది రెండవవాడి కివ్వడం న్యాయమన్నాడు. తనకే అట్ట యిచ్చినా ఫరవాలేదన్నాడు. ఎందుచేతంటే తను వాటిని చెయ్యలేదు. తాను పేస్టు రాశాడు. కాని అది ఒక పెద్దపని కాదని ఒప్పేసుకున్నాడు

రెండవ కొడుకు అతి ముక్తసరిగా "అన్నయ్య ఐడియా యిచ్చాడు. అమ్మ డబ్బిచ్చింది. అవన్నీ చేసింది నేను. అంతే నేను చెప్పవలసేది" అన్నాడు.

"నాకా అట్టమీద పెద్ద మోజేమీ లేదు. వాను చేసినంత మాత్రానా దాని మీద హక్కల్లా తనదే అయిపోయినట్టు వాడు మాటాడితే నాకు చిర్రెత్తుకొచ్చి నాకే రావాలన్నానా అట్ట. అసలలా చెయ్య వచ్చనీ, చేద్దామనీ ఐడియా యివ్వడమే కాక అమ్మను ఒప్పించి డబ్బిప్పించింది నేను".

"అమ్మ ఎవరడిగినా డబ్బిస్తుంది. బజారుకెళ్ళి అవన్నీ తెచ్చినవాడు చిన్నన్నయ్య అవన్నీ చేసినవాడూ వాడే. అందుచేత వాడికే వెళ్తుంది అట్ట."— మూడవవాడు.

"పెద్దన్నయ్య ఐడియా ఇవ్వకపోతే అసలీ అట్టలే ఇప్పుడు పుట్టవ్."

"ఒట్టి ఐడియాలకి అట్టలు ఎప్పటికీ పుట్టవ్".

సుందరరామయ్య జడ్జీగారి డిగ్నిటీలో ఆర్డర్ ఆర్డర్ అని అరిచేడు.

అంతవరకూ ఊరుకున్నాక ఆవిడ అట్టలవంక చూస్తూ పెదవులపై ఒక హాసంతో ఉల్లాసంలో ఉన్నాడు.

ఎందుచేతో భార్యవీ, అప్పగారివీ ఉద్దేశాలు ఆతడు తెలుసుకోవడం ఉపేక్షించదలుచుకున్నట్టున్నాడు

తన్నడిగందే మాట్లాడటం భార్యకు అలవాటులేదు. తన్నడిగకపోయినా తన సలహా లిచ్చేయడం ఆడబడుచు కలవాటు.

అయినా ఆవిడ కొంచెంసేపు ఆగి చూసింది. ఇక సుందరరామయ్య ఏదో అనేశేట్టున్నాడనగా ఆవిడ నోరు విప్పింది. మాటాడేముందు ఇటూ అటూ చూడ్డం ఆవిడకి అలవాటు. తల ముందుకు పెట్టడం కూడా ఆవిడకి అలవాటు.

"ఉండు నే చెపుతా విను. అది— న్యాయం..."

"—చెప్పి నే సలహా లిచ్చేయడం ధర్మం." రెండోవాడు పూర్తి చేశాడు.

వాడిగొంతు విన్నాక, అంతేనన్న వాడి ముఖం చూసేక సుందరరామయ్య ఆలోచనలో నిలచిపోయేయి. అతడు కొడుకు కండ్లలోకి లోతుగా లోతుగా చూస్తూ అడిగేడు.

"ఎందుచేతట"

"ఇంటికి పెద్దవాడు కదా — ఎప్పటికైనా — మీ తరువాత"

సుందరరామయ్య ముఖంకేసి ఎవరూ చూడటంలేదు.

"అవునురా పెద్దవాడన్నాక పెద్ద వాడే. వాడి తరువాతే మీరంతా. ముందు పెద్దవాడెంచుకోవడమే సబబు." — అన్నది మేనత్త.

చిన్నవాడిలోని మనిషిలో మనిషి తమాషా అయినవాడు. వాడు మేనత్త ముఖంలోకి చూస్తూవుంటే గొలుసున కట్టిన జాగిలం ముందు కురుకుతూ మొరగడం కనిపించింది.

సుందరరామయ్య భార్య అడబడుచు దబాయింపు విని ఊరుకోలేకపోయింది.

"మీరు సబబులూ లోకాచారాలూ మాటాడితే పెద్దవాడివంతు వాటా వేయడం — చిన్నవాళ్లు ఎత్తుకోవడం రివాజు."

ఒకవంక మేనత్త ఏదో మాటాడు తూనే వుంది —

"అలా అయితే నేనే ముందెంచుకో వాలి" అంటున్నాడు నాల్గవవాడు.

"కాదు. చెల్లి" అన్నాడు మూడు.

సుందరరామయ్యకు కొడుకులకు లభించిన లభిస్తున్న లోకజ్ఞానం చూస్తే చిరాకు పుట్టినట్లున్నది.

మీరంతా ఒక్కసారి ఊరుకోండి!" పెద్దవాళ్ళ నుద్దేశించి చిన్నవాళ్ళతో అన్నాడు.

వాళ్ళంతా ఊరుకున్నారు.

—సుందరరామయ్యకు ఆ ఐడియా బాగానే ఉన్న చనిపించింది.

"అదే బాగుంది ముందు ఆఖరువా డెత్తుకుంటాడు."

"వా డెత్తుకున్నాడు — సాదా అట్ట తీసుకున్నాడు" అన్నాడు రెండవవాడు.

వాడికళ్ళల్లో చదరంగం ఆదే ఆసామీ 'ఆటకట్టు - ఎత్తు' వేళాక చూసే చూపు కనిపించింది.

"అది కేన్సిల్. ఇప్పు డెత్తుకుంటాను మళ్ళా. అప్పుడు నాకు తెలిసింది కాదు. ఇచ్చేయండి. నా కా తెలికో అట్ట యిచ్చేయండి" అంటూ పెదన్నవంక కోటల్ని జయించివచ్చిన సైన్యాధిపతులు రాజులవంక చూసేచూపులు చూస్తూ ముందుకు వచ్చేడు ఆఖరువాడు.

"ఆగు!" అన్నాడు చిన్నబ్బాయి. "ఆ పద్ధతి బొడ్డుంబా లయితే అది కొన వరకూ బొడ్డుంబాలే."

ఆఖరువాడు ఆగిపోయేడు.

"అంతా నీ యిష్టమే నే(?)రా" — అన్నది మేనత్త రెండవవాడితో.

రెండవవాడు జవా బివ్వకుండా తండ్రి ముఖంలోకి చూశాడు. సుందర రామ య్యకు తప్పిందికాదు.

"నువ్వే పో" అన్నాడు ఆఖరువాణ్ణి.

వ్వే ఏం చేస్తాం అన్నట్లు పెదవ్విరిచి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు వాడు. వాడు నిసలైన కర్మయోగిలా ప్రవర్తించినట్లు ఎవళ్లూ గుర్తించినట్లు లేదు.

పెద్దవాడి మొహంలోకి ఉడికింప చూపులు చూస్తూ మూడవవాడు నవ్వాడు. అది తండ్రి సమక్షం కాకపోతే వాడివీపు చిట్లకుండేదా అని వాడికే అనుమానం వేసింది.

సుందరరామయ్యకి క్రమంగా చిరాకు ప్రారంభ మయ్యింది. అతడి బుద్ధి పరిపరి విధాల పోతున్నది.

'లాటరీ వేసేస్తే' అనుకున్నాడోసారి. అట్ట ఎవరివీ కావని దాచేస్తే అనుకున్నా డింకోసారి. అంతకన్నా అవన్నీ చింపి పారేస్తే పీడ వదులుతున్న ట్టయ్యింది భార్య. పోనీ యింకో అట్ట అలాటిదే చేయిస్తే! దానికన్నా మంచి అట్ట తాను స్వయంగా చేసి పెద్దవాడికిస్తే......! ఆడపిల్లని ఆడపిల్ల కిచ్చేయడం ఆడవాని వ్యవహార మనిపించింది సుందర రామయ్యకు.

"అసలు ఒక అట్ట వేరే ఎందుకు చేశారూ?"

"ఆ ఐడియా కూడా అన్నయ్యే యిచ్చిందే."

"చిన్నన్నయ్యా అన్నీ ఒకలాటివే చేసుకుందా మన్నాడు."

"అప్పుడల్లా ఎవరమో ఒకరం తీసు కుందా మన్నాడు."

సుందర రామయ్యకు ఎటుపోయినా ఓటమి ఎదు రవడం చిరాకును పెంచు తోంది. అతడు ఆలోచిస్తున్నాడు. ఆలో తనకు తెగని సమస్య యున్నదంటే అతను నమ్మడు.

ఈలోగా తక్కినవా శ్యంతా వాది స్తున్నారు

తలుచుకుంటే అలాంటివి పదిచెయ్య గల మంటున్నాడు నాల్గవవాడు. అయితే ఎందుకు చేసుకోలే దంటున్నాడు మూడవ వాడు. చేసుకుంటాం చూడవోయ్ అంటు న్నాడు నాల్గవవాడు. పేద అంటున్నాడు మూడు. మనకు చేతనయ్యే దదే! నాల్గు. కనపడుతూనే ఉంది! మూడు.

రెండవ రంగంలో మేనత్త మరదల్ని పట్టుకొని దులుపుతున్నది.

రెండో వాడికి చిన్నంతరవూ పెద్దం తరవూ లేదంటున్నది. ఇవాళన్న నయ్యింది రేపు తండ్రిని కాదంటా డన్నది.వాడు చెడిపోవడం తప్పదన్నది. వాడు పొరుక్షు పకారమంటే పొయ్యాక్ప కునే రక మన్నది. పొరుగు పచ్చోర్వలేని వారు బాగుపడ రన్నది. ఈ జన్మలో పెట్టి పుట్టనివారి కేజన్మలోనూ పుట్టక పోవడం నిశ్చయ మన్నది. ఒకరి కిచ్చే టప్పుడు మంచిదిచ్చి తా నుంచుకునేది పుచ్చు దుంచుకోవడం పుణ్యం చేసుకునే వారి బుద్ధన్నది. పాపంచేస్తే పాపం, పుణ్యంచేస్తే పుణ్యం తప్ప యింకేదీ తమ వెంట రా దన్నది.

"ఒక్క అట్టలు తప్ప" అన్నాడు రెండోవాడు. వాడిగొంతు విలక్షణంగా వినబడ్డది.



అందరూ మాటలాపి వాడి వంక చూస్తున్నారు.

వాడు సూటిగా తండ్రివద్దకు వెళ్ళి అతని ఒడిలో ఉన్న అట్లన్నీ తీసుకున్నాడు.

"అత్తా! నే నీ అట్లు పంచుతాను చూడు. అన్నయ్య ఆరేసి అణాలన్నాడు కాని బజారులో ఇవి ఒక్కొక్కటి పావలాయే అమ్మ ఇచ్చిన అర్ధరూపాయికి ఇవిగో రెండట్లు. అన్నయ్య ఐడియాకు ఈ పావలా అట్టు ఎక్కువ. తమ్ముడు చేసిన సాయం చాలా తక్కువే. అయినా నాకు రెండున్నాయి అంచేత తమ్ముడికొక టిచ్చేస్తున్నాను నేను చేసుకున్నాను కాబట్టి ఈ అట్టంటేనాకు యిష్టంగా ఉంది. కాబట్టి ఈ కాలికో అట్టు నాది."

అని అక్కణ్ణుంచి వెళ్ళిపోతూ అల్లంత దూరం వెళ్ళి అక్కడ ఆగి అత్త వంకే తిరిగి మళ్ళీ అన్నాడు. వాడి పెదవులు ఎంత ఆపుకున్నా ఆగక వణుకుతున్నాయి. అలా వణకడం వాడికి ఏ మాత్రం కూడా యిష్టం లేదు వాడికి వెంట వెంటనే సరియైన మాటలు స్ఫురణకు రావడం లేదు అందుక్కూడా వాడికి వాడిపైన కోపం వస్తున్నది.

"మొదట అన్నయ్యని పంచమన్నాము వాడికి పంచడానికి చేతులు రాలేదు. అమ్మకు పంచడం యిష్టమే అయినా ఆమెకు చేతనయ్యింది కాదు. చేతనయ్యే నాన్నగారు ఎందుచేతో వెనకాముందూ ఆలోచిస్తున్నారు. నువ్వైతే అడక్కుండానే పంచటానికి వచ్చావు.

కాని "పంచినవాళ్ళు పాపాన పోతా రని సామెత నువ్వే మొన్న చెప్పేవుకదా!! నువ్వు పెద్దదానివి. నిన్ను నరకానికి పంపడం నా కిష్టంలేదు అందుచేత ఆపాప మేదో నేనే మూటకట్టుకుంటు న్నాను."

ఇలా చెప్పి వాడు వీధి గదిలోకి వెళ్ళి పోయేడు.

అతంటా నిశ్శబ్ద మలముకున్నది. అందరూ బొమ్మల్లా చూస్తున్నారు.

"చూశావురా వీడి అఘాయిత్యం" అన్న అడబడుచు ఆక్రోశం చెవినిపడగా సుందరరామయ్య భార్య ఆమెవంక చూసి అటునుండి భర్తవంక తిరిగింది

సుందరరామయ్య ఎర్రగా చాలా ఎర్రగా జేవురించిన ముఖాన్ని ఆవలివంక తిప్పేసుకుంటున్నాడు.

పిల్లలకు వాళ్ళింట్లో గొడవలు జరగడం మరీకొత్త కాదు. కాని ఇలాంటి సంఘటన జరగడం ఇదే మొదటిసారి. వాళ్ళ కెందు చేతో ఒక్కడుండడం మంచిపని కాదని పించింది.

అందరూ వెళ్ళిపోయినా సుందర రామయ్య భార్యమాత్రం వెళ్ళలేదు. అందు చేత కొంతసేపయేక అతడు విడచిన దీర్ఘనిశ్వాసం అతడి భార్య ఒక్కతే విన్నది.

* * *

ఆమధ్యాహ్నం చిన్నబ్బాయిని తల్లి వేరే పిలిచి అన్నది.

"నువ్వా మంచి అట్ట ఏదో అన్నయ్య క్కాకపోతే నాన్నగారికేనా ఇచ్చేయ వలసింది."

ఇస్తే —"

"ఆయన క్కావాలా ఏమన్నానా! నీ బుద్ధికి సంతోషించి దానిని తిరిగి నీకే ఇచ్చేశేవారు."

ఆ తల్లిమాటలు విన్న ఆ కొడుకు చూపులో అనుమాన చ్ఛాయలు కనుపించాయి. కాని ఎంత వెతికినా వాడికా ముఖంలో అనుమానించదగ్గ దేమీ కనుపించలేదు.

వాడు వయసుచేతా అనుభవంచేతా చిన్నవాడు. అందుచేత తల్లిని అర్థంచేసుకోవడంలో పొరపాటు జరిగింది.

నిజానికి వాడామెవంక చూడవలసింది అలా కాదు — జాలిగా చాలా జాలిగా చూడవలసిందా యిల్లాలివంక.